నేత్రపర్వం.. గంగనీళ్ల ఉత్సవం


దిలావర్‌పూర్‌లో పోచమ్మ తల్లికి వలతో స్వాగతం పలుకుతున్న భక్తజనం

సారంగాపూర్, దిలావర్‌పూర్ న్యూస్‌టుడే : గంగ నీళ్లు తెచ్చి.. అడెల్లి పోచమ్మకు పోసి.. అంటూ భక్తిపారవశ్యంతో సాగిన గంగనీళ్ల జాతర ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. శనివారం అడెల్లిలోని పోచమ్మ ఆలయం నుంచి ఆభరణాలతో గోదావరి తీరానికి పాదయాత్రగా వెళ్లిన భక్తులు ఆదివారం రాత్రి ఆలయానికి తిరిగి వచ్చారు. వెండి కడవలో తీసుకొచ్చిన గోదావరి జలం, స్థానిక కోనేటి నీటితో ఈవో రమేష్ ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాసశర్మ పోచమ్మ తల్లికి అభిషేకించి ఆభరణాలను అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో జాతర ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం వేకువజామున గోదావరి నీటితో అమ్మవారి ఆభరణాలను శుద్ధి చేసి తిరిగి శనివారం వెళ్లిన గ్రామాల మీదుగా పాదయాత్రగా రాత్రి 7.30 గంటలకు అడెల్లి ఆలయానికి చేరుకున్నారు. ఊరూరా మహిళలు మంగళహారతులు, డప్పు వాయిద్యాలతో పోచమ్మ ఆభరణాలకు స్వాగతం పలికారు. ఆ తల్లి ఆభరణాలను చేతితో తాకారు.


ఆభరణాల అలంకరణ అనంతరం భక్తులకు దర్శనమిస్తున్న పోచమ్మ తల్లి

పత్తి కొనుగోళ్లకు సన్నద్ధం

నిర్మల్, న్యూస్‌టుడే : జిల్లాలో వానాకాలం సీజన్‌లో 1.50 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తుండగా 14 లక్షల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ పత్తిని సీసీఐ ద్వారా జిల్లాలోని భైంసా, నిర్మల్, కుభీరు, సారంగాపూర్ ప్రాంతాల్లోని జిన్నింగు మిల్లుల్లో కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దసరా తర్వాత సీసీఐ ద్వారా అన్ని కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.


సారంగాపూర్ సమీపంలో సాగవుతున్న పత్తి



ఇదివరకే పత్తి రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలోని 18 గ్రామీణ మండలాల్లో 73,111 మంది రైతులు ఈ వానాకాలంలో పత్తి సాగు చేశారు. ఆయా వివరాలను వ్యవసాయాధికారులు మార్కెటింగ్ శాఖ అధికారులకు పంపించారు. వ్యవసాయాధికారుల వివరాల ప్రకారం ప్రతి రైతులకు సంబంధించి మార్కెటింగ్ శాఖ అధికారులు క్యూఆర్ కోడ్‌తో ముద్రించిన గుర్తింపు కార్డులు జారీ చేయడానికి చర్యలు చేపడుతున్నారు. కార్డులు పూర్తయిన తర్వాత వ్యవసాయశాఖ అధికారులు పత్తి సాగు చేసిన రైతులకు వీటిని అందజేస్తారు.

అక్రమాలకు అడ్డుకట్ట..

గతేడాది కంటే ఈ సారి 25 వేల ఎకరాలు ఎక్కువ విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు. జిల్లాకు సరిహద్దున మహారాష్ట్ర ఉండటంతో అక్కడి నుంచి పత్తి వచ్చే అవకాశాలు ఉంటాయి. రైతులకు క్యూఆర్ నెంబరుతో గుర్తింపు కార్డులు ఇవ్వనున్న నేపథ్యంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు వ్యాపారులు, దళారులను నియంత్రించి పత్తి కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

గుర్తింపు కార్డులు ఇలా..

పత్తి పండించిన రైతులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన గుర్తింపు కార్డులు అందజేయనున్నారు. రైతు సమగ్ర సర్వే వివరాలతోపాటు బార్‌కోడ్‌తో రూపొందించిన గుర్తింపు కార్డులు ఉంటాయి. పత్తి విస్తీర్ణం, సగటు దిగుబడి, అమ్మకానికి తీసుకొచ్చిన పత్తి వివరాలను అధికారులు సులువుగా గుర్తించే వీలుండటంతో సదరు రైతు తనకు సంబంధించి పత్తిని అమ్మడానికి మాత్రమే అవకాశముంటుంది. పత్తిపై నిర్ణయించిన ధర నమోదు చేయగానే ఆ వివరాలు నేరుగా మార్కెట్ సీసీఐ అధికారులకు చేరుతుంది. దీంతో రెండు, మూడు రోజుల్లో రైతు ఖాతాల్లో పత్తి విక్రయాల మొత్తం జమ అవుతుంది.

పండగ తర్వాత ప్రారంభం

- శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, నిర్మల్

జిల్లాలోని భైంసా, నిర్మల్, కుభీరు, సారంగాపూర్‌లలోని జిన్నింగు మిల్లుల్లో దసరా పండగ తర్వాత పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తాం. పత్తి తీసుకొచ్చే సమయంలో రైతుల వద్ద అధికారులు జారీ చేసిన నిజ రైతు గుర్తింపుకార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ ఉండాలి. గుర్తింపుకార్డు లేకుంటే సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారి జారీ చేసిన నిజ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి.

మూల నక్షత్ర వేడుకలకు.. పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రసాదాల కొరత లేకుండా అయిదు కౌంటర్లు

ముథోల్, (బాసర), న్యూస్‌టుడే:

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని బాసర ఈఓ విజయరామారావు అన్నారు. ఈ నెల 9వ తేదీన బుధవారం బాసర సరస్వతీ క్షేత్రంలో నిర్వహించే మూల నక్షత్ర ఉత్సవాలకు వేల మంది భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆలయ ఈఓ విజయ రామారావుతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది.

ముఖాముఖి


ఆలయ ఈఓ విజయరామారావు

? న్యూస్‌టుడే:మూల నక్షత్ర ఉత్సవాల సమయంలో గతంలో ఏర్పాట్లు లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాటిని ఎలా అధిగమిస్తారు?

ఈఓ: ఈ సారి సుమారు 50 నుంచి 60 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేశాం. అక్షరాభ్యాసం, దర్శనం, ప్రత్యేక దర్శనం అని సూచికలు రాసి క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో టికెట్లు తీసుకున్న వారికి ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశాం. వారికి అరగంటలోపు దర్శనం, అక్షరాభ్యాసం అయ్యేలా ఏర్పాట్లు చేశాం. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం.

? ఉత్సవాలకు వచ్చే సాధారణ భక్తులు గదులు లేక ఆరు బయట నిద్రించాల్సిన పరిస్థితి ఉంది.

వంద గదులకు మరమ్మతులు పూర్తి కాలేదు. దీంతో ఉన్న గదులను భక్తులతో పాటు వీఐపీలకు ఇస్తున్నాం. సామాన్య భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం. నిజామాబాద్, హైదరాబాద్ నుంచి ఒక రోజు ముందు కాకుండా అదే రోజు ఉదయం వస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ సారి ఉదయం రెండు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు అక్షరాభ్యాసాలు నిర్వహిస్తాం.

? భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఏం చేస్తున్నారు?

వీఐపీ టోకెన్లను పూర్తిగా రద్దు చేశాం. వీఐపీ వస్తే వారి కోసం ప్రత్యేకంగా సిబ్బంది ఉండి దర్శనం చేయిస్తారు. ప్రత్యేక అక్షరాభ్యాసం కోసం వేరే క్యూలైన్లు, చిన్న పిల్లలకు పాలు ఇవ్వడానికి ప్రత్యేక కేంద్రాలు, భక్తులు కూర్చోవడానికి వరుసలో బెంచీలు ఏర్పాటు చేస్తున్నాం. క్యూలైన్లలోని భక్తులందరికీ పాలు, బిస్కెట్లు, తాగునీరు అందజేస్తాం. ఈ సారి రెండు చోట్ల పాలను వేడి చేయించి సాయంత్రం వరకు పంపిణీ చేస్తాం.

? గోదావరి వద్ద ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

గోదావరి వద్ద ప్రమాదాలు జరగకుండా పాత పడవలను అడ్డుగా పెట్టి గజ ఈతగాళ్లకు ప్రత్యేక దుస్తులు అందజేసి ఏర్పాట్లు చేశాం. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి గోదావరి వద్ద రెండు తాత్కాలిక గదులు ఏర్పాటు చేశాం. మిగిలిన ఘాట్‌లలో కూడా ఏర్పాటు చేస్తాం. గోదావరి సమీపంలో ఆలయ భూమిలో, పోలీసుస్టేషన్ ఎదురుగా వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశాం. ఈ సారి చరవాణి కౌంటర్లలో ఆలయం తరపున ఉచితంగా భద్రపర్చి భక్తులకు తిరిగి అందజేస్తాం. ప్రసాదాల కొరత లేకుండా అయిదు కౌంటర్లు ఏర్పాటు చేశాం. తాత్కాలిక సిబ్బందిని నియమించి ఎక్కువ మొత్తంలో ప్రసాదాలు తయారు చేయిస్తున్నాం.

ఎగవేతదారులకే ఎందుకు కేటాయింపు?


- సీఎంఆర్ అప్పగింతలో ఎడతెగని జాప్యం!

ఈనాడు, ఆసిఫాబాద్, మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే

పైసా పెట్టుబడి లేకుండా రూ.కోట్లలో ధాన్యం నిల్వలు పొంది సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) రూపంలో ఇచ్చే బియ్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్లను అధికారులు డిఫాల్టర్లుగా (ఎగవేతదారుగా) గుర్తించారు. 25 శాతం అదనంగా వీరు బియ్యం ఇవ్వాలని ఆదేశాలు చేసి ఏళ్లు గడుస్తున్నా.. మిల్లర్లు పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. తుది గడువు ఎప్పటికప్పుడు పొడిగించడం, నేతల అండదండలతో బియ్యాన్ని ఇవ్వకపోవడం వంటి ఘటనలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చోటుచేసుకుంటున్నాయి. రూ.కోట్ల విలువైన సీఎంఆర్ సకాలంలో రాకపోవడం, మరో పక్షం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సమస్య మరింత జటిలంగా మారనుంది.

వానకాలం (ఖరీఫ్) సీజన్ ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా సరిహద్దుగా ఉన్న మహారాష్ట్ర నుంచి వడ్లు పోటెత్తే అవకాశముంది. ఈ ప్రాంతాల్లో ఎక్కడా చెక్‌పోస్టులు లేకపోవడంతో.. రేషన్ బియ్యం విచ్చలవిడిగా సరిహద్దు దాటుతున్న విషయం విదితమే. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ, పోలీసులు సంయుక్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చడం లేదు. బియ్యాన్ని సకాలంలో ఇవ్వకుండా రెండు, మూడు సంవత్సరాల నుంచి తప్పించుకు తిరుగుతున్న వారిని బ్లాక్ లిస్టులో పెట్టి, మళ్లీ ధాన్యం కేటాయించవద్దనే ప్రభుత్వ ఆదేశాలు ఎక్కడా అమలు కావడం లేదు.


చెన్నూరు సమీపంలో ఉన్న రైస్ మిల్లు ఇది. మూడేళ్లలో రూ.1.32 కోట్ల సీఎంఆర్ బియ్యం ఇక్కడి నుంచి రాకపోవడంతో అధికారులు సీజ్ చేశారు.



- ఒక్కసారి డిఫాల్టర్లుగా మిల్లర్లను గుర్తించిన అధికారులు మళ్లీ ఎందుకు వారికే ధాన్యం నిల్వలు కేటాయిస్తున్నారో అంతుపట్టని విషయంగా మారుతోంది. బియ్యం ఇవ్వని వారికి 25 శాతం అదనంతోపాటు, 12 శాతం వడ్డీ, బ్యాంకు గ్యారెంటీలతో సీఎంఆర్‌ను సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. కానీ పూర్తి స్థాయిలో సఫలం కావడం లేదు. ఈలోపే మరో సీజన్‌కు సంబంధించిన కొనుగోళ్లు ప్రారంభం కావడంతో బియ్యం ఇచ్చే గడువు పెంచుకుంటూ పోతున్నారు.

జిల్లాల్లో పరిశీలిస్తే..

- మంచిర్యాలలో 39 మిల్లులను డిఫాల్టర్లుగా అధికారులు గుర్తించారు. 2019-20, 2021-22, 2022-23 మూడేళ్ల పరిధిలో 9008.76 మెట్రిక్ టన్నుల బియ్యం ఇంకా రావాల్సి ఉంది. రూ.32.42 కోట్ల విలువైన బియ్యం రావాలి.
- నిర్మల్ జిల్లాలో 9 మిల్లులను డిఫాల్టర్లు ప్రకటించారు. వీటి నుంచి ఏడు వేల మెట్రిక్ టన్నులు బియ్యం అంటే రూ.27 కోట్ల విలువైనవి రావాల్సి ఉంది. 2023-24లో రెండు సీజన్లకు సంబంధించి 1,41,223 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు ఉన్నాయి.
- కుమురం భీం జిల్లాలో 2024 రబీ సీజన్‌కు సంబంధించి 16 మిల్లులకు ధాన్యం ఇచ్చారు. ఇందులో సెప్టెంబరు 30వ తేదీ వరకు 6 శాతం మాత్రమే సీఎంఆర్ వచ్చింది. 13 మిల్లుల నుంచి వచ్చింది సున్నా.

సీఎం కప్ క్రీడా జ్యోతికి ఘన స్వాగతం


క్రీడా జ్యోతితో జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్, ర్యాలీలో పాల్గొన్న జిల్లా అదనపు పాలనాధికారి ఫైజాన్ అహ్మద్, పుర ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్

నిర్మల్, న్యూస్‌టుడే : సీఎం కప్ క్రీడా జ్యోతికి ఆదివారం స్థానిక శివాజీచౌక్‌లో పాలనాధికారి అభిలాష అభినవ్, అదనపు పాలనాధికారి(స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్‌లు స్వాగతం పలికి అక్కడి నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ర్యాలీగా వచ్చారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డితో కలిసి క్రీడా జ్యోతిని ఆదిలాబాద్ క్రీడాధికారులకు అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఆటల్లో నైపుణ్యం కనబరుస్తున్న క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్రవ్యాప్తంగా సీఎం కప్ టార్చ్ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా కేంద్రాల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకునేలా అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. ఆటల్లో నైపుణ్యం చూపించిన క్రీడాకారులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు ఆటలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. సీఎం కప్ పేరిట గ్రామ, మండల, జిల్లా స్థాయిలో వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా అదనపు పాలనాధికారి(స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భుక్యా రమేశ్, ఒలింపిక్ అసోసియేషన్ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, సీఎం కప్ టార్చ్ ర్యాలీ నిర్వాహకులు వెంకటేశ్వర్‌రావు, మధు పాల్గొన్నారు.

పనుల్లో జాప్యం.. అవస్థలనేకం


చేపల మార్కెట్ వద్ద రోడ్డు కనపడనంతగా ఉన్న దుమ్ము


వాహనం వెనక వస్తే ఇలా ముక్కు, కళ్లు మూసుకోవాల్సిందే..

జిల్లా కేంద్రంలోని ఈద్గాం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు రోడ్డు భవనాలశాఖ ఆధ్వర్యంలో రహదారి పనులు చేపడుతున్నారు. పనులు మొదలు పెట్టి కంకర వేసి దానిపై డస్టు పోయగా పనుల జాప్యంతో వ్యాపారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల వెనక వెళ్తే రోడ్డు కనపడక, ఊపిరి ఆడక అవస్థలు పడుతున్నామని, త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు. - చిత్రాలు : న్యూస్‌టుడే, నిర్మల్

సంచార వ్యాపారి.. చకచకా పరుపు తయారీ


వాహనంపై తెచ్చిన యంత్రంతో పరుపు తయారు చేసి ఇస్తున్న వ్యాపారి

ఏ వ్యాపారంలోనైనా పోటీ తీవ్రమైంది. అద్దెలు, ఖర్చులు పెరుగుతున్న తరుణంలో సంచార వ్యాపారం వైపు పలువురు దృష్టిసారించారు. మామడ మండలం పొన్కల్‌లో ఓ వాహనంపై పరుపులు, తలదిండ్లు తయారు చేసే యంత్రం పెట్టుకొని ఇళ్ల వద్దకు వస్తున్నారు. కోరుట్ల, జగిత్యాలకు చెందిన ఈ వ్యాపారులు నిర్మల్ జిల్లాలోని గ్రామాల్లో ఇలా సంచార వ్యాపారం చేస్తూ కనిపిస్తున్నారు. పాత పరుపుల్లోని పత్తిని తీసి యంత్రంలో వేసి శుభ్రం చేసి సరికొత్త వాటిని తయారు చేసి ఇస్తున్నారు. దూదిని తూకం వేసి కిలోల చొప్పున తయారీ కూలీ తీసుకుంటున్నారు. .-న్యూస్‌టుడే, మామడ

మొరం వేసి.. చదును చేసి..

వందనం

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై 61 నుంచి మండలంలోని మాటేగాం సమీపంలోని గిడ్డంగి వరకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉంది. సరకులతో భారీ వాహనాలు వెళ్తున్న క్రమంలో కూరుకుపోతున్నాయి. ఈ సమస్యపై ఈనాడులో 'రోడ్డు సౌకర్యం లేక.. అవస్థలు తప్పక' శీర్షికన ఆదివారం చిత్రవార్త ప్రచురితం అయింది. దీనికి స్పందించిన అధికారులు ఆదివారం మొరం వేసి రోడ్డును బాగు చేశారు. సమస్య పరిష్కారం అవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


మాటేగాం సమీపంలోని గిడ్డంగులకు వెళ్లే రహదారిపై మొరం వేసి చదును చేస్తున్న సిబ్బంది

చేనేత కార్మికులను ఆదరించాలి

నిర్మల్, న్యూస్‌టుడే : చేనేత కార్మికులను ఆదరించాలని మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎం.ఎస్.ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ ప్రదర్శనను ప్రారంభించారు. చేనేత కార్మికులకు అండగా ఉండి వారి ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. చేనేత దుస్తులను వాడాలని సూచించారు. వివిధ స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పవన్ కుమార్ మోది, రాహుల్‌కుమార్, కృష్ణ, రాధె, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్‌గా సయ్యద్ అర్జుమండ్ అలీ




నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నిర్మల్‌కు చెందిన సయ్యద్ అర్జుమండ్ అలీని నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్న ఆయనకు ఈ పదవి వరించింది. బ్లాక్ కాంగ్రెస్ నిర్మల్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన నిర్మల్ శాసనసభ, ఆదిలాబాద్ పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో చురుకుగా పని చేసి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా పేరున్న ఈయనకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పదవి రావడంపై ఆయన అనుచరులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రగతి సాధనకు ప్రత్యేక పరీక్షలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో విషయాలపై పట్టు, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు జాతీయ సాధన సర్వే(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షను నిర్వహిస్తున్నారు. అన్ని యాజమాన్యాలకు సంబంధించిన 3, 6, 9 తరగతుల వారికి వీటిని చేపట్టనున్నారు. సదరు ఎన్ఏఎస్ ప్రతినిధులు బడులను ఎంపిక చేయనున్నారు. ఇందులో వారు సాధించిన ప్రగతి ఆధారంగా విద్యా ప్రమాణాలను అంచనా వేయనున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు సదరు పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచి సన్నాహాలు ప్రారంభించారు.

జిల్లా వివరాలు ఇలా..
విద్యాలయాలు 1,034
విద్యార్థులు 1,17,196


పరీక్ష రాస్తున్న విద్యార్థులు, చిత్రంలో పర్యవేక్షణ చేస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

మాదిరి పరీక్షలు..

3, 6 తరగతుల వారికి 45 మార్కులు, తొమ్మిదో తరగతి పిల్లలకు 60 మార్కుల చొప్పున కేటాయించి ఆయా విషయాల్లో నైపుణ్యతను పరీక్షించనున్నారు. ఎంపిక చేసే పాఠశాల ఏది అనేది ముందస్తుగా తెలియజేయకుండా చివరి రోజుల్లో ప్రకటించనున్నారు. విద్యార్థులను పూర్తి స్థాయిలో సంసిద్ధులను చేసేందుకు ఎన్ఏఎస్ పరీక్ష పత్రం మాదిరి ఉండేలా సెప్టెంబరు 10న నిర్వహించారు. 30న మరో పరీక్ష జరపనున్నారు. నవంబరు 8న మరో పరీక్ష నిర్వహించనున్నారు. జాతీయ సాధన సర్వే పరీక్ష డిసెంబరు 4న దేశ వ్యాప్తంగా చేపట్టనున్నారు.

విద్యా ప్రమాణాలు సాధించేలా..

- ఎ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

జిల్లాలో మంచి విద్యా ప్రమాణాలు పిల్లలకు అందుతున్నాయి. 1-10 తరగతుల వరకు ఆంగ్ల మాధ్యమ బోధనతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతోంది. జాతీయ సాధన సర్వే పరీక్షలో సత్ఫలితాలు సాధించేలా ముందస్తుగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో ప్రత్యేకంగా మాదిరి పరీక్షలు చేపట్టాం. విషయాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించేలా వారిని తీర్చిదిద్దుతున్నాం. ఎవరైనా వెనుకబడిన వారు ఉంటే వారి విషయంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

నేడు



కెరమెరి ఘాట్ అందాలు

నాడు



వేసవిలో..

ప్రకృతి ఒడిలో.. మలుపుల్లో

కుమురం భీం జిల్లాలోని కెరమెరి ఘాట్ ప్రకృతి రమణీయతను సంతరించుకుని ఒక్కో సీజన్‌లో ఒక్కోరకంగా మారుతూ ఉంటుంది. మలుపులతో కూడిన దారుపై అయిదు కిలోమీటర్ల ఘాట్ ప్రయాణం.. ఆహ్లాదాన్నిస్తుంది. చుట్టూ ఎటు చూసినా ఎత్తైన చెట్లతో కూడి పచ్చదనం పర్చుకుని పక్షుల కిలకిలారావాలు, చల్లని గాలి మధ్య ప్రయాణికులు చక్కటి అనుభూతికి లోనవుతారు. అదే వేసవి సమయంలో ఆకులన్నీ రాలిపోయి మోడుబారిపోయిన చెట్లతో కనిపిస్తుంది. మూడు నెలల కిందటి వరకు సరైన వానలు లేక ఘాట్ నిర్జీవంగా ఉండగా.. ప్రస్తుతం భారీ వర్షాలతో చెట్లన్నీ చిగురించి చూపరులను ఎంతోగానో ఆకట్టుకుంటోంది. ఆ చిత్రాలే ఇవి. - న్యూస్‌టుడే, కెరమెరి



కూష్మాండ దేవి అలంకరణలోని అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు



ఆలయంలో భక్తుల సందడి

కూష్మాండ దేవిగా బాసర అమ్మవారు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన ఆదివారం సరస్వతి అమ్మవారు కూష్మాండ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి రాజోపచార, చతుష్షష్టి పూజలు నిర్వహించారు. నవరాత్రులతోపాటు ఆదివారం సెలవు కలిసి రావడంతో తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం, క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. దర్శనానికి సుమారు గంటన్నర సమయం పట్టింది. నాందేడ్‌కు చెందిన జగదీశ్ మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. కోటి గాజుల మండపంలో విజయవాడ, హైదరాబాద్‌కు చెందిన పలువురు విద్యార్థులు చేసిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మైదానం అనుకుంటే.. గుర్రపుడెక్కలో కాలేసినట్లే!



గుర్రపుడెక్క పేరుకుపోయిన ఖానాపూర్ చెరువు

పచ్చటి మైదానంలా కనిపిస్తున్న ఇది ఖానాపూర్ చెరువు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 114 ఎకరాల్లో విస్తరించి ఉంది. గతంలో ఈ చెరువులో చేపలను పెంచి.. విక్రయించి గంగపుత్ర కుటుంబాలు ఉపాధి పొందేవి. తర్వాత చెరువు ఆక్రమణలకు గురికావడంతో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రూ.4.83 కోట్లు వెచ్చించి సుందరీకరణ, అభివృద్ధి పనులు ప్రారంభించారు. పనుల్లో నాణ్యత లేని కారణంగా నిధులన్నీ నీటి పాలయ్యాయి. ప్రస్తుతం ఈ చెరువు కాలుష్య కారకంగా మారింది. పట్టణంలోని మురుగంతా చెరువులో చేరుతుండగా.. మరోవైపు చెరువు మొత్తం ఇలా గుర్రపుడెక్కతో నిండిపోయి కంపుకొడుతోంది.

- ఈనాడు, ఆదిలాబాద్



ఇక క్రీడా పండగ

● 16 నుంచి సీఎం కప్ పోటీలు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడా విభాగం :

యువతలో క్రీడా సంస్కృతి పెంపొందించాలని, ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలని, వారు విశ్వ క్రీడల్లో పతకాలు సాధించాలన్న ముఖ్య ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా చీఫ్ మినిస్టర్(సీఎం) కప్-2024 నిర్వహించనుంది. ఈ నెల 16 నుంచి విడతల వారీగా గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలలో ఆయా క్రీడాంశాలలో పోటీలు నిర్వహించేందుకు షెడ్యూలును ఖరారు చేసింది. ఈ రెండు నెలల పాటు ఉమ్మడి జిల్లాలోని మైదానాలు పోటీలతో కళకళలాడడమే కాకుండా క్రీడా పండగ వాతావరణం నెలకొంటుంది. వర్ధమాన క్రీడాకారులకు తమ ప్రతిభ చాటేందుకు ఇదొక చక్కని వేదిక అవుతుంది.



హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం కప్-2024 పోటీల లోగో మస్కట్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మండలస్థాయి : ఈ నెల 22 నుంచి 26 వరకు

జిల్లాస్థాయి.. నవంబరు 4 నుంచి 8 వరకు

అథ్లెటిక్స్.. 100మీ., 400మీ.ల పరుగు, మహిళల వాకింగ్ 400 మీ.లు, పురుషులకు వాకింగ్ 800 మీ.లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో

బ్యాడ్మింటన్ : సింగిల్, డబుల్స్, మిక్స్‌డ్

బాక్సింగ్ : 46, 48, 51, 54, 54-57, 57-60 కిలోల బరువు విభాగాలు

ఈత : ఫ్రీ-స్టైల్ 100మీ., బెస్ట్ స్ట్రోక్ 50మీ., బ్యాక్ స్ట్రోక్ 50మీ., బటర్‌ఫ్లై 50మీ.

కుస్తీ : 57, 65, 74, 86 కిలోల బరువు విభాగాలు

ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్ జట్లు

రాష్ట్రస్థాయి.. నవంబరు 18 నుంచి 22 వరకు

అథ్లెటిక్స్ : 100మీ., 400మీ.ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, మహిళల వాకింగ్ 400మీ.లు, పురుషుల వాకింగ్ 800మీ.లు, షాట్‌పుట్

బాక్సింగ్ : 46-48 కిలోలు, 51-54 " , 54-57 " , 57-60 "

విలువిద్య : ఇండియన్ రౌండ్ 30మీ.లు, రికర్వ్ రౌండ్ 60మీ.లు, కంపౌండ్ రౌండ్ 60మీ.లు

ఈత : ఫ్రీ-స్టైల్ 100మీ.లు, బ్రెస్ట్ స్ట్రోక్ 50మీ.లు, బ్యాక్ స్ట్రోక్ 50మీ.లు, బటర్‌ఫ్లై 50మీ.లు.

బ్యాడ్మింటన్ : సింగిల్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్

కుస్తీ : 57 కిలోలు, 65 కిలోలు, 74 కిలోలు, 86 కిలోలు

షూటింగ్: పిస్టల్ ఈవెంట్స్ 10 మీ.లు, రైఫిల్ 10 మీ.లు, ఓపెన్ సైట్ 10మీ.లు

టేబుల్ టెన్నిస్ : సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్

లాన్ టెన్నిస్ : సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్

జిమ్నాస్టిక్స్ : ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, పొమ్మెల్ హార్స్, రోమన్ రింగ్స్, టేబుల్ వాల్ట్

వెయిట్ లిఫ్టింగ్ : 49 కిలోలు, 55 కిలోలు, 61 కిలోలు, 67 కిలోలు, బాలికల కోసం ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, బ్యాలెన్స్ బీమ్, అనివెన్ బార్, టేబుల్ వాల్ట్

బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, సెపక్‌తక్రా జట్లు

పోటీలు ఇలా..

సబ్ జూనియర్(14 ఏళ్ల లోపు), యూత్/జూనియర్(18 ఏళ్ల లోపు), మెన్ అండ్ వుమెన్ ఓపెన్(18 ఏళ్లు దాటినవారు) విభాగాల్లో పోటీలు ఉంటాయి.

గ్రామీణస్థాయి..

ఈ నెల 16 నుంచి 19 వరకు.. (అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్)

(అథ్లెటిక్స్ విభాగంలో 100 మీ, 400 మీ.ల పరుగు, మహిళలకు వాకింగ్ 400 మీ.లు, పురుషుల వాకింగ్ 800 మీ.లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో)

వీరికి బాధ్యతలు..

ఉమ్మడి జిల్లాలో సీఎం కప్ పోటీలు క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన ఉత్తర్వులు జిల్లా యువజన క్రీడల అధికారులకు అందాయి. జిల్లా విద్యాశాఖతో పాటు అన్నీ క్రీడా సంఘాల బాధ్యులు, పీఈటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు ఇందులో భాగస్వాములు కానున్నారు.

క్రీడా జ్యోతి పరుగు..

సీఎం కప్ పోటీల నేపథ్యంలో తెలంగాణలోని 33 జిల్లాల్లో క్రీడా జ్యోతి పరుగు నిర్వహిస్తున్నారు. ఈ నెల 6న నిర్మల్, ఆదిలాబాద్, 7న ఆసిఫాబాద్, మంచిర్యాల ప్రాంతాల్లో క్రీడా జ్యోతి పరుగు ఉంటుందని జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ కార్యాలయం సిబ్బంది పేర్కొన్నారు.

లఘుచిత్రం.. సంస్కృతి ఔన్నత్యం



న్యూస్‌టుడే, దండేపల్లి :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతిబింబం బతుకమ్మ పండగ. తొమ్మిది రోజుల పాటు పల్లెల్లో సందడి చేసే ఈ పండగ మన మధ్య స్నేహభావం, ఆత్మీయత, అనుబంధాలు పెంపొందిస్తాయి. పాటల్లో జానపద, చారిత్రకమైన పలు సామాజిక అంశాల పరమార్థాన్ని తెలియజేస్తాయి. ఇంతటి విశిష్టత ఉన్న పండగ గొప్పదనంపై లఘుచిత్రాలను రూపొందిస్తూనే మరోవైపు సమాజంలో ఉన్న రుగ్మతలు రూపుమాపుతూ దేవాలయాల విశిష్టతను వివరిస్తూ.. ప్రజల్లో చైతన్యం పెంచేందుకు కృషి చేస్తున్నారు. తాము రూపొందించిన చిత్రాలు, జానపద గేయాలను ప్రపంచానికి తెలిపే విధంగా వివిధ యూట్యూబ్ ఛానళ్లలో విడుదల చేస్తున్నారు.

దేవాలయాల విశిష్టతను తెలియజేస్తూ..



బతుకమ్మ పాటను చిత్రీకరిస్తూ..

తెలంగాణ పండగలతో పాటు పురాతన దేవాలయాల చరిత్రను తెలియజేస్తూ లఘు చిత్రాలు, వీడియోలు నిర్మిస్తున్నారు లక్ష్మీకాంతాపూర్‌కు చెందిన చిలుకూరి స్వాతి. తెలంగాణలో చారిత్రాత్మక దేవాలయాలు ఉన్నా చాలా మందికి వీటి గురించి తెలియవు. వీటి చరిత్ర, గొప్పదనాన్ని వివరిస్తూ చిత్రాలు నిర్మించి 'ఇంట్రెస్టింగ్ ఫ్యాక్ట్స్ ఆఫ్ యూనివర్స్' అనే ఛానల్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. వీటితో పాటు బతుకమ్మ విశిష్టత, పండగలకు పుట్టింటితో ఉండే అనుబంధాలను తెలియజేస్తున్నారు.

పండగల గొప్పదనాన్ని వివరిస్తూ..

బతుకమ్మ పండగ వచ్చిందంటే దేశ విదేశాల్లో ఉన్న వారు సైతం పల్లెలకు వచ్చి ఆనాటి అనుబంధాలను గుర్తు చేసుకుంటారు. డీజేలు, సౌండ్ బాక్సులు, కోలాటాలకే పరిమితం అవుతున్న నేటి తరుణంలో పండగ విశిష్టత, పాటల్లో దాగి ఉన్న పరమార్థం, గొప్పదనాన్ని తెలుపుతూ మహిళల్లో చైతన్యం నింపేలా జానపద గేయాలు రూపొందిస్తున్నారు భీమారం మండలం దాంపూర్‌కు చెందిన చేగొండ నిరోషా. స్వీయ రచన, నటన, ఎడిటింగ్ చేసి చిత్రాలను నిర్మించి వీటిని యూట్యూబ్‌లో 'ఎంఎస్ఎస్ ఫోక్ వీడియో' ఛానల్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.



బతుకమ్మ ఆట చిత్రీకరిస్తున్న దృశ్యం

ప్రజల్లో చైతన్యం తెచ్చేలా...



అల్లూరి సీతారామరాజు లఘు చిత్రం నిర్మాణంలో..



డబ్బింగ్ చెబుతూ రమారాణి

విజ్ఞానం, వినోదంతో పాటు ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవసరమైన లఘు చిత్రాలు నిర్మిస్తున్నారు మంచిర్యాలకు చెందిన బద్రి రమారాణి. జిజ్ఞాస అనే యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించి దీనిద్వారా సమాజహితమైన చిత్రాలను నిర్మిస్తున్నారు. తెలంగాణ చరిత్ర, వారసత్వం, సంప్రదాయాలు, పండగల విశిష్టతను తెలియజేస్తూ పలు చిత్రాలను రూపొందించారు. తెలుగు బోధకురాలైన ఈమె పలు తెలుగు పాఠాలను సైతం గ్రాఫిక్స్‌లో రూపొందిస్తున్నారు.

పల్లె సంప్రదాయాలు ప్రతిబింబించేలా..

పల్లె సంస్కృతి, సంప్రదాయాలు, పండగల విశిష్టతను తెలియజేస్తూ పలు నృత్యాలతో కూడిన జానపద గేయాలు నిర్మిస్తున్నారు దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్‌కు చెందిన ముల్కల్ల మురళి. నటన, దర్శకత్వంలో రాణిస్తూ గుర్తింపు పొందుతున్నారు. యూట్యూబ్‌లో ఫోక్ బ్యాండ్, రుచిత క్రియేషన్స్ ఛానల్‌లో తన వీడియోలు ఉంచుతున్నారు. పల్లెల్లో బతుకమ్మ సందడితో పాటు పట్టణాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడి పండగ వేళ పల్లెలకు వచ్చే మహిళలు తమ పుట్టింటితో ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తున్నారు. ఇలా పలు వీడియోలను రూపొందిస్తున్నారు.



పాట ప్రారంభోత్సవంలో మురళి

నవోదయలో ప్రవేశాలకు ఆఖరి అవకాశం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకు సోమవారంతో గడువు ముగియనుందని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కొడాలి పార్వతి తెలిపారు. దీంతోపాటు 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు సైతం దరఖాస్తులను చేసుకోవాలని, వీటి గడువు ఈ నెల 30తో ముగియనుందని పేర్కొన్నారు. 6వ తరగతిలో మొత్తం 80 సీట్లు ఉన్నాయన్నారు. ప్రవేశాలకు మొదట సెప్టెంబరు 16వ తేదీ ఆఖరిగా నిర్ణయించినా.. తదనంతరం పొడిగించిదన్నారు. వచ్చే ఏడాది జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

గాంధీ నుంచి బాధితురాలి డిశ్ఛార్జి

జైనూరు: జైనూర్ మండలంలో జరిగిన హత్యాచారయత్నం ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆదివాసీ మహిళ గాంధీ ఆసుపత్రిలో కోలుకుని ఆదివారం డిశ్ఛార్జి అయ్యింది. మంత్రి సీతక్కతోపాటు కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆసుపత్రికి వచ్చి ఆమె యోగక్షేమాలు తెలుసుకొని, సొంతూరికి పంపించారు.



పోచమ్మ ఆభరణాలను ఎత్తుకున్న ఎస్పీ జానకి షర్మిల



సాంగ్వి గోదావరి నదిలో పోచమ్మ తల్లి నగలు శుభ్రం చేస్తున్న పూజారులు



సారంగాపూర్ శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

జనగంగ.. జాతర మురవంగ

దిలావర్‌పూర్, సారంగాపూర్ న్యూస్‌టుడే : గంగనీళ్ల జాతరలో భాగంగా అడెల్లి పోచమ్మ తల్లి ఆభరణాలతో వచ్చిన పూజారులు శనివారం రాత్రి దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి పోచమ్మ ఆలయంలో జాగరణ చేశారు. ఆదివారం వేకువజామున ఇదే గ్రామ శివారులోని గోదావరి నదిలో పోచమ్మ తల్లి నగల శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. తిరిగి అడెల్లి ఆలయానికి చేరుకునే క్రమంలో కంజర్, బన్సపల్లి, దిలావర్‌పూర్, మాడేగాం గ్రామాల భక్తజనం బండారి, కొబ్బరినీళ్లు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఎస్పీ జానకి షర్మిల జాతరలో పాల్గొన్నారు. రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు దిలావర్‌పూర్‌లో ఇంటి ఆడపడుచులు స్వగ్రామానికి రావడం ఆనవాయితీ. దీంతో ప్రతి ఇంట పండగ వాతావరణం నెలకొంది. దీంతోపాటు గ్రామంలో ఏర్పాటు చేసే ఇథనాల్ పరిశ్రమను తరలించాలని గ్రామస్థులు పెద్ద ఎత్తున నినాదాలతో పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు.

దుస్తులు అమ్మి.. బడిపంతులుగా ఎంపికై



వారసంతలో చెలిమెల రాజు..

న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ : వారిది పెద్ద కుటుంబం.. అతడు పదో తరగతి వరకు చదవడమే కష్టమైంది. తల్లి కూరగాయల విక్రయం.. తండ్రి వీధుల్లో, వారసంతలో దుస్తుల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. వారి కష్టాన్ని చూసి తమ్ముడు, ముగ్గురు చెల్లెళ్లకు పెద్దన్నగా మారారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించగానే ఆపేశారు. తాను కూడా తండ్రిలాగే ద్విచక్రవాహనంపై వెళ్లి గ్రామాలు, వారసంతల్లో విక్రయించారు. పదేళ్ల తరువాత దూరవిద్య ద్వారా డిగ్రీ, బీఈడీ, పీజీ పూర్తి చేశారు. పట్టుదలతో చదివి సర్కారు ఉద్యోగాలు సాధించారు మంచిర్యాల జిల్లాకు చెందిన చెలిమెల రాజు. ఆయన ప్రస్తుత డీఎస్సీలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో మూడో ర్యాంకు సాధించారు.

పదేళ్లు ఆపేసి.. ఆపై ప్రయత్నించి

లక్షెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన లక్ష్మి, రాయమల్లు దంపతుల పెద్ద కుమారుడు రాజు. అతడి తమ్ముడు ప్రస్తుతం వాణిజ్య పన్నుల శాఖలో డీసీటీఓగా కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నారు. అన్నదమ్ములిద్దరూ కలిసి ముగ్గురు చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేశారు. తండ్రి అయిదేళ్ల క్రితం మరణించగా అతనే ఇంటికి పెద్దదిక్కయ్యారు. కాగా తన పదో తరగతి 1998లోనే పూర్తి చేశారు. ఆర్థిక ఇబ్బందులు, తల్లిదండ్రుల కష్టాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో చదువును పక్కనపెట్టారు. ఇంటికి చేదోడుగా ఉంటూనే సర్కారు కొలువు సాధించాలనే ఆలోచనలో పడ్డారు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. 2008-2011లో దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం బీఈడీ, పీజీ పూర్తిచేశారు. గురుకుల కొలువుల ప్రకటన వెలువడటంతో పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా ఎంపిక య్యారు. అక్కడ విధులు నిర్వర్తిస్తూనే డీఎస్సీకి సిద్ధమయ్యారు. స్కూల్ అసిస్టెంట్(తెలుగు)గా జిల్లాలో రెండో ర్యాంకు సాధించి ఎంపికయ్యారు. భాషా (తెలుగు) పండితుడిగా జిల్లాలో మూడో ర్యాంకు సొంతం చేసుకున్నారు. పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సులువే అని నిరూపించారు రాజు. చదువుకు విరామం వచ్చిందని, విశ్రమించకుండా ఆలస్యమైనా తన లక్ష్యానికి చేరువయ్యారు.

నాలుగు ఉద్యోగాలతో సత్తా



కాందేకర్ శివాజీ

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: ఓ అభ్యర్థి ఏకంగా డీఎస్సీ-2024 ఫలితాల జాబితాలో వేర్వేరు కేటగిరిల నాలుగు టీచరు పోస్టులకు ఎంపిక కావడం విశేషం. మావల మండలం బట్టిసావర్గాం పంచాయతీ దుబ్బగూడకు చెందిన నాయీ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కాందేకర్ హన్మాండ్లు-లలిత దంపతుల కుమారుడు శివాజీ స్కూల్ అసిస్టెంటు ఫిజికల్ సైన్సులో రెండో ర్యాంకు, ఎస్ఏ తెలుగులో 15వ ర్యాంకు, భాషా పండిత(ఎల్‌పీ) కేటగిరిలో 32వ ర్యాంకు, ఎస్జీటీ విభాగంలో 70వ ర్యాంకు సాధించారు. ఈ విషయాన్ని గ్రహించిన విద్యాశాఖ శనివారం ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికైన వారిని డైట్ కళాశాలకు పిలిపించి వారి నుంచి ఏ పోస్టుకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారో అభ్యర్థన పత్రాన్ని తీసుకున్నారు. నాలుగింటిలో ఫిజికల్ సైన్సు ఉద్యోగానికి శివాజీ తొలి ప్రాధాన్యం ఇస్తూ ఆ పత్రాన్ని సమర్పించారు. శివాజీ డిగ్రీ తర్వాత ఎంఎస్సీ(కెమిస్ట్రీ), ఎంఏ(తెలుగు), బీఎడ్, డీఎడ్‌తో పాటు భాషా పండిత కోర్సులు పూర్తి చేశారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, తదితరులు

బంజారా సమాజ్ ఉన్నతికి కట్టుబడి ఉన్నాం

ఎదులాపురం, ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : బంజారా సమాజ్ ఉన్నతి కోసం కట్టుబడి ఉన్నామని ప్రజా ప్రతినిధులు స్పష్టం చేశారు. ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2 కోట్లతో ఆదిలాబాద్ పట్టణంలో నిర్మించతలపెట్టిన బంజారా భవన్ నిర్మాణానికి ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్‌తో కలిసి ఎంపీ గోడం నగేష్ భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. బంజారా సంప్రదాయం ప్రకారం జగదాంబదేవి, సంత్ సేవాలాల్ మహరాజ్, సంత్ శ్రీరామారావు మహరాజ్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భోగ్ సమర్పించారు. సకల హంగులతో భవన నిర్మాణానికి ఎంపీ నగేష్, ఎమ్మెల్యే శంకర్ సహకరించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. అనంతరం ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన మాజీ ఎంపీ రాఠోడ్ రమేష్ ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అమర్‌సింగ్ తిలావత్(ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు), జనార్దన్ రాఠోడ్(జడ్పీ మాజీ ఛైర్మన్), రూపావత్ అమర్‌సింగ్, రాఠోడ్ సజన్, రాఠోడ్ భీంరావు(ఈఈటీడబ్ల్యూ), రాఠోడ్ సురేష్(ఈఈఆర్అండ్‌బీ), జాదవ్ నరేష్, రాఠోడ్ బాబూలాల్(ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర కోశాధికారి), రాఠోడ్ బాబురావు చౌహాన్(మాజీ మంత్రి కర్ణాటక), రాఠోడ్ రామారావు, కిషన్ చౌహాన్, శ్రావణ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

?: లింబా(కె)-ఓలా రహదారి మార్గంలో కల్వర్టు వద్ద రహదారి వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. సూచిక లేక వాహనచోదకులకు ఇక్కట్లు తప్పడం లేదు. - లింబా(కె), గ్రామస్థులు

✓: తాత్కాలిక మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. - క్రాంతికుమార్, పీఆర్ ఏఈ, కుంటాల

-న్యూస్‌టుడే, కుంటాల

?: పట్టణంలోని శాస్త్రీనగర్‌లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కాలువల్లో మురుగు శుభ్రం చేయడం లేదు. - కాంబ్లె సాహెబ్‌రావు, స్థానికుడు

✓: పారిశుద్ధ్య కార్మికులతో చెత్త తొలగించి పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకుంటాం. - బి.రాజేశ్ కుమార్, కమిషనర్, భైంసా

-న్యూస్‌టుడే, భైంసా

పొదలు పెరిగిన దారి.. ఇరుకుగా మారి



మండలంలోని దిమ్మదుర్తి నుంచి నల్లుర్తి వెళ్లే ప్రధాన మార్గానికి ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగాయి. అవి రోడ్డుకు దగ్గర దాకా రావడంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే ముందుకెళ్లడం కష్టంగా మారింది. ముఖ్యంగా పెద్ద వాహనం వచ్చినప్పుడు ద్విచక్రవాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఈ సమస్యను ఎంపీడీవో గంగాసాగర్‌రెడ్డి దృష్టికి తీసికెళ్లగా పొదలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. -న్యూస్‌టుడే, మామడ

వర్షం.. సోయా రైతులకు శాపం

కుంటాల, న్యూస్‌టుడే: వానాకాలంలో పత్తి పంటకు ప్రత్యామ్నాయంగా జిల్లావ్యాప్తంగా లక్ష 2 వేల ఎకరాలకుపైగా సోయాను కర్షకులు సాగు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి అనుకూలించడంతో పంట ఏపుగా పెరిగి చక్కటి దిగుబడులు వస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కోత పనులకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. టైర్‌తో నడిచే యంత్రానికి గతంలో రూ.1800 వరకు చెల్లించే వారు. అప్పటితో పోల్చుకుంటే ఇప్పుడు రూ.2000 పైగా చెల్లించాల్సి వస్తోంది. చైన్ యంత్రానికి గతేడాది రూ.2000 వరకు చెల్లించగా ప్రస్తుతం రూ.2300-2500 వరకు చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చైన్‌తో నడిచే యంత్రంతో భూమి బలంగా మారి యాసంగి దుక్కులకు ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం 40 శాతం కోతలు మాత్రమే పూర్తి కాగా వర్షం కారణంగా 60 శాతం కోతలు నిలిచిపోయాయి. వర్షంతో పంట నిలువునా తడిసి దిగుబడుల నాణ్యతపై ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం ఎకరానికి ఆరు నుంచి పది క్వింటాళ్ల మేర దిగుబడులు వస్తున్నాయి. పంట పొలాలకు వెళ్లే అంతర్గత రహదారులు అభివృద్ధికి నోచుకోకపోవడంతో రవాణా సమస్య తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. తరచూ కురుస్తున్న వర్షంతో మొరం రహదారులు బురదమయంగా మారి రైతుల పాలిట శాపంగా మారుతోంది.



పెంచికల్‌పాడ్‌లో చైన్ యంత్రంతో సోయా నూర్పిడి చేస్తున్న రైతు



ద్విచక్రవాహన ప్రదర్శనగా కవ్వాల్ టైగర్ రిజర్వు లోకి వరకు వచ్చిన అటవీ అధికారులు

అడవులతో పర్యావరణ సమతుల్యత

కడెం, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉడుంపూర్ ఉప అటవీక్షేత్రాధికారి ప్రకాశ్ అన్నారు. ఆదివారం 70వ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఉడుంపూర్‌నుంచి దోస్తునగర్ సమీప అడవిలో ఉన్న 'కవ్వాల్ టైగర్ రిజర్వు' లోకి వరకు ద్విచక్రవాహన ప్రదర్శన నిర్వహించారు. అక్కడ వన్యప్రాణుల కోసం పెంచుతున్న గడ్డి క్షేత్రాలను గురించి ఆ ప్రాంత ప్రజలకు వివరించారు. ఎఫ్ఎస్‌వో సురేందర్, ఎఫ్‌బీవోలు ప్రసాద్, సరిత, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



5కే రన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి జితిన్‌కుమార్

అటవీశాఖ ఆధ్వర్యంలో 5కే రన్

ఖానాపూర్, న్యూస్‌టుడే: అటవీశాఖ 70వ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని కుమురం భీం చౌరస్తా నుంచి 5కే రన్‌ను ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ ప్రారంభించారు. పట్టణంలోని జంగల్ హనుమాన్ ఆలయం వరకు పరుగు నిర్వహించారు. పట్టణ యువకులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నిత్యం నడక, పరుగుతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో కిరణ్, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన యువకులు

ముధోల్(బాసర), న్యూస్‌టుడే: నిజామాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన కిరణ్‌సింగ్ శనివారం రాత్రి బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా నవీపేట మండలంలోని యువకులు గుర్తించి కాపాడి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న బాసర ఎస్సై గణేశ్ ఘటనా స్థలానికి చేరుకుని అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ యువకులను ఎస్సై అభినందించారు. యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఖానాపూర్ గ్రామీణం: క్రీడలు ఒత్తిడిని తగ్గించి, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఎస్సై రాహుల్ గైక్వాడ్ అన్నారు. మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ఆదివారం గ్రామస్థులు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. అనంతరం క్రికెట్ పోటీల నిర్వాహకులు ఎస్సైని శాలువాతో సత్కరించారు. మహేందర్, గజేందర్, రమేష్, శివకృష్ణ, సాజిద్, గిరి పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయ చైర్మన్‌గా శ్రీకాంత్

నిర్మల్ పట్టణం: స్థానిక బంగల్‌పేట్‌లోని సుప్రసిద్ధ మహాలక్ష్మి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా కొడకల శ్రీకాంత్ నియమితులయ్యారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎంపికను ఖరారు చేశారు. కౌన్సిలర్ చైతన్య, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నాందేవ్ చిన్ను, నాయకులు బీంరెడ్డి, పూదరి అరవింద్, భూరాజ్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

భైంసా, న్యూస్‌టుడే: భైంసా ప్రాంతంలో ఏ సమస్య వచ్చినా పోలీసులు హిందువులపై అక్రమ కేసులు పెడుతున్నారని, వాటిని ఎత్తివేయాలని హిందూ ధర్మ పరిరక్షణ సమితి నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను కరీంనగర్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ప్రాంత పరిస్థితులపై ఆయనకు వివరించి పోలీసుల పక్షపాత వైఖరిని కట్టడి చేయాలని కోరినట్లు నాయకులు తెలిపారు. దీనికి స్పందించిన మంత్రి వెంటనే అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని ఉన్నతాధికారులకు చరవాణిలో మాట్లాడినట్లు వివరించారు. రెండు మూడు రోజుల్లో కేసులను తొలగించేందుకు భైంసాకు వచ్చి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పెండెపు కాశీనాథ్, తూము దత్తాత్రి, శివకుమార్, నందు భయ్యా, భాజపా ఫ్లోర్ లీడర్ సిందే, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపాల్ సార్డా తదితరులు ఉన్నారు.



బండి సంజయ్‌తో భైంసా హిందూ ధర్మ పరిరక్షణ సమితి నాయకులు


గర్భిణిని ఆసుపత్రికి చేర్చిన పోలీసులు

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ గర్భిణిని ఆసుపత్రికి చేర్చి భైంసా గ్రామీణ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. భైంసా గ్రామీణ ఎస్సై శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్ శ్రీధర్ రెడ్డి శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో ఎగ్గాం గ్రామ శివారులో పెట్రోలింగ్ వాహనంలో వెళ్తుండగా ఓ వ్యక్తి రోడ్డుపై నిలబడి వాహనం కోసం ఎదురు చూస్తున్నాడు. వివరాలు కనుక్కోగా తన భార్య పురిటి నొప్పులతో బాధపడుతుందని తెలిపాడు. దీంతో ఆ గర్భిణిని పోలీసు వాహనంలో ఎక్కించుకుని భైంసాలోని ఓ ఆసుపత్రికి సురక్షితంగా చేర్చారు. కానిస్టేబుళ్లను ఎస్పై, స్థానికులు అభినందించారు.



భైంసాలోని ఓ ఆసుపత్రిలో గర్భిణిని సురక్షితంగా చేర్చిన పోలీసులు

సూరీడు.. స్తంభంపై దీపమై..



అరుణ వర్ణంతో ఉదయిస్తున్న సూర్యుని అందాలు కడెం జలాశయం పరిసరాల్లో కనువిందు చేస్తున్నాయి. లేలేత కిరణాలతో పొగమంచును చీల్చుకుని వస్తున్న సూరీడు కడెం జలాశయం వద్ద ఉన్న పాత జనరేటర్ స్తంభంపై దీపంలా ఆకట్టుకునేలా కనిపిస్తుండగా 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. -న్యూస్‌టుడే, కడెం

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు



కుంటాల అందకూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



పూజలో పాల్గొన్న ఏఎస్పీ అవినాశ్ కుమార్



బోనాలు తీసుకెళ్తున్న పరిమండల్ వాసులు



అంబకంటిలో బోనాలతో మహిళలు



కడెం: రామాలయంలో..



భైంసాలో వాసవిదేవికి కరెన్సీ నోట్లతో అలంకరణ



నిర్మల్‌లో..

కుంటాల, భైంసా న్యూస్‌టుడే : కుంటాల మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఆదివారం జరుపుకొన్నారు. భైంసా పట్టణంలో కొలువుదీరిన దుర్గామాతలకు భక్తులు వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఏఎస్పీ అవినాశ్ కుమార్ కిసాన్‌గల్లిలోని దుర్గా దేవి పూజల్లో పాల్గొన్నారు. సంతోషిమాతా నగర్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవిదేవికి బంగారు, వెండి వర్తక సంఘం ఆధ్వర్యంలో రూ.51,000 నోట్లతో అలంకరించారు.

సోన్, కుంటాల, నిర్మల్ పట్టణం, ఖానాపూర్, న్యూస్‌టుడే : సోన్ మండలంలోని శాకెర శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం చండీయాగం, కుంకుమార్చన నిర్వహించారు. కుంటాల గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. నిర్మల్ పట్టణంలోని స్థానిక ప్రియదర్శినినగర్ సాగర్ కాలనీలో ప్రతిష్ఠించిన దుర్గామాతను ఆదివారం రూ.50 వేల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఖానాపూర్ పట్టణంలోని వేంకటేశ్వరాలయం నుంచి స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. ఇంద్రనగర్ గంగపుత్ర కాలనీ దుర్గాదేవి అమ్మవారికి కాలనీవాసులు ఆదివారం రాత్రి బోనాలు సమర్పించారు.

దుర్గమ్మకు బోనం.. ఊరంతా సంబురం

మామడ, నర్సాపూర్(జి), లక్ష్మణచాంద, కుంటాల : మామడ మండలంలోని పరిమండల్, బోయివాడ, న్యాకపువాడ దుర్గామాత మండపాల వద్ద, లక్ష్మణచాంద మండలంలోని మునిపెల్లిలో అమ్మవారికి బోనాలు నిర్వహించారు. కుంటాల మండలం అంబకంటిలో ఛత్ర సేన యూత్ ఆధ్వర్యంలో బోనాల పండగ చేపట్టారు.



బోయివాడ దుర్గామాత వద్ద ..



లక్ష్మణచాంద: మునిపెల్లిలో బోనాలతో మహిళల ఊరేగింపు



ఇంద్రనగర్ గంగపుత్ర కాలనీలో..



ఖానాపూర్:నవరాత్రుల్లో నాలుగో రోజు ముత్యాల పోచమ్మ అమ్మవారు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2003-04 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

నర్సాపూర్(జి), న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని గురువులను సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

ఉత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి : ఎమ్మెల్యే

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: విజయదశమి నేపథ్యంలో స్థానిక బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో అక్కడ చేపట్టిన ఏర్పాట్లను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ప్రాంగణంలో తిరుగుతూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రావణదహనం, శమీపూజ, ఆయుధపూజకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, వాహనాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, స్థానిక నాయకులు, భాజపా నేతలు పాల్గొన్నారు. అనంతరం నందిగుండం ప్రసన్న దుర్గామాత ఆలయాన్ని సందర్శించారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు.

భాజపాతో అభివృద్ధి సాధ్యం

దస్తూరాబాద్, న్యూస్‌టుడే: భాజపాతో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మున్యాల్, ఆకొండపేట, రేవోజిపేట, దస్తూరాబాద్ గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, మండల అధ్యక్షుడు కొడిమెల లక్ష్మణ్, వెంకటరమణ, సాగర్‌గౌడ్, రాజు, రాము ఉన్నారు.



ఆకొండపేటలో పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి

నిర్మల్ పట్టణం: భాజపా, అనుబంధ సంఘాల్లో యువతరం భాగస్వామ్యాన్ని వీలైనంత ఎక్కువగా పెంచాలని ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి శంకరోల్ల రవికుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని సూచించారు. ప్రతీ మండలానికి కనీసం వెయ్యి మందిని సభ్యులుగా చేర్పించేలా ఓబీసీ విభాగం ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండాజి నరేంద్రచారి, ఉపాధ్యక్షుడు తోట సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆకుల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: కుంటాలలో భాజపా నాయకులు ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురికి సభ్యత్వాన్ని అందజేశారు. నాయకులు జి.వి.రమణరావు, జక్కుల గజేందర్, కేశెట్టి అశోక్, కేశవ్‌రావు, సుదర్శన్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నేర వార్తలు

అనారోగ్య సమస్యలు భరించలేక యువకుడి ఆత్మహత్య



ఆడెపు రాజు

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే : మండలంలోని దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన ఆడెపు రాజు(37) కడుపు నొప్పి భరించలేక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన ఆడెపు రాజు కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం, వైద్య ఖర్చులు భరించక శనివారం స్థానిక కొచ్చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం కుటుంబ సభ్యులు గమనించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నామని ఎస్సై సందీప్ తెలిపారు.

మారణాయుధం కలిగిన వ్యక్తి అరెస్టు

నిర్మల్ పట్టణం: నిబంధనలకు విరుద్ధంగా మారణాయుధం కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన రాజేశ్ అనే వ్యక్తి స్థానికంగా ఓ రెస్టారెంట్‌ను నిర్వహిస్తుంటాడు. స్థానికంగా ఎప్పుడైనా ఏవైనా గొడవలు జరిగితే అడ్డువెళ్లేందుకు తన వద్ద ఒక ఆయుధం కలిగి ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం గుర్తుతెలియని వ్యక్తి నుంచి తల్వార్ కొనుగోలు చేసి తన దుకాణంలో దాచి ఉంచాడు. ఈ విషయమై పోలీసులకు పక్కా సమాచారం అందడంతో ఆదివారం అక్కడకు చేరుకున్నారు. ఈలోపు దాన్ని వేరే చోట దాచేందుకు తీసుకెళ్తుండగా అడ్డుకొని ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలు లభ్యం

ఖానాపూర్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ శివారు వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రాంతంలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించామని ఎస్సై రాహుల్‌గైక్వాడ్ తెలిపారు. భిక్షం ఎత్తుకుని జీవించే వ్యక్తి అయి ఉంటాడని 45-50 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి శవాగారంలో మృతదేహాన్ని ఉంచామన్నారు. వివరాలకు 87126 59524, 87126 59523 చరవాణిలో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

నర్సాపూర్ (జి): మండలంలోని రాంపూర్ గ్రామ శివారులోని ఎర్రకుంట చెరువులో ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం మృతి చెందిన వ్యక్తి తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ఇతడు మరణించి రెండు రోజులు అయి ఉండవచ్చని భావిస్తున్నారు. రాంపూర్ తాజా మాజీ సర్పంచి గోవింద్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

తాగిన మైకంలో తనయుడిని విక్రయించిన తండ్రి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కాలని, ఓ తండ్రి తాగిన మైకంలో కన్న కొడుకుని విక్రయించిన ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం నందిపేట్ మండలం సిద్ధాపూర్‌కు చెందిన లక్ష్మి, పోశెట్టి దంపతులు ఏడాదిగా కొటార్మూర్‌లో నివాసం ఉంటున్నారు. భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి తనయుడిని(7 నెలలు) ఇటీవల పెర్కిట్‌కు చెందిన మహ్మద్ గౌస్ ద్వారా ఆర్మూర్ శాస్త్రీనగర్‌కు చెందిన హబీబ్‌ఖాన్‌కు రూ.30 వేలకు విక్రయించారు. హబీబ్ ఖాన్ కుమార్తెకు సంతానం లేకపోవడంతో నిర్మల్‌లో ఉన్న తన కుమార్తె రషీద, అల్లుడు మహ్మద్‌కు బాలుడిని ఇచ్చాడు. వారం గడిచాక పోశెట్టి డయల్ 100కు ఫోన్ చేసి, తన కుమారుడిని ఇప్పించాలని కోరాడు. ఆర్మూర్, నందిపేట్ పోలీసులు విచారించగా విక్రయ ఉదంతం బయటపడింది. విక్రయంలో భాగమైన అయిదుగురిపై(పోశెట్టి, మహ్మద్ గౌస్, హబీబ్‌ఖాన్, రషీద, మహ్మద్) పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్నారిని బాలల సంరక్షణ అధికారులకు అప్పగించారు.

సంక్షిప్త సమాచారం

మిత్రుడికి ఆర్థికసాయం అందజేత

పెంబి: అనారోగ్యంతో బాధపడుతున్న పెంబి గ్రామానికి చెందిన ఉర్ల గొండ వెంకట నర్సయ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం తన చిన్ననాటి మిత్రులు ఆదివారం రూ.11 వేల నగదు అందజేశారు. జోగు రమేష్, మోహన్, మట్ట వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మైకు, సౌండ్ సిస్టం..

భైంసా గ్రామీణం: మండలంలోని వానల్‌పాడ్‌లో శ్రీ సింహ సహిత విజయ దుర్గామాత ఆలయ కమిటీ సభ్యులకు గ్రామంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున రూ.54 వేల విలువైన మైక్ మరియు సౌండ్ సిస్టంను ఆదివారం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులు కడారి దశరథ్, గణపతి, భోజారాం, అట్టోలి భూమన్న, శ్రీనివాస్ రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

డీటీఆర్ ఏర్పాటు పనులు ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని అయిదోవార్డు ఇంద్రనగర్ కాలనీలో 100 కేవీ డీటీఆర్ ఏర్పాటు పనులను ఆదివారం వార్డు కౌన్సిలర్ పర్మి లత ప్రారంభించారు. డీటీఆర్ ఏర్పాటుతో లోవోల్టేజీ సమస్య ఉండదన్నారు. పర్మి సురేష్, ఉమర్, మెంగు రాము, వాసేఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చించిన భారాస నేతలు

పెంబి: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పెంబి నుంచి షెట్పల్లి గ్రామానికి వెళ్లే రహదారి కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయి. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆరోపిస్తూ ఆదివారం భారాస మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి సొంతత ఖర్చులతో రహదారిపై ఏర్పడ్డ గుంతలపై మట్టి వేయించి మరమ్మతులు చేయించారు. నాయకులు గండ్ల శంకర్, కౌట నరేందర్, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

కాకో అమ్మవారికి పూజలు

దండేపల్లి గ్రామీణం : దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి నది తీరాన కొలువైః పద్మల్‌పురి కాకో అమ్మవారిని ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ దర్శించుకున్నారు. ముందుగా గంగమ్మతల్లికి పూజలు చేశారు.



నిర్మల్‌లోని ప్రియదర్శినినగర్ రోడ్ నెంబర్-5లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



భైంసాలో..



బతుకమ్మను నిమజ్జనానికి తీసుకెళ్తున్న ఆర్యవైశ్య సంఘం మహిళలు

ఘనంగా బతుకమ్మ పండగ

భైంసా, న్యూస్‌టుడే : పట్టణంలో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మను తయారు చేసి పూజలు నిర్వహించి ఆటపాటలు, కోలాటలతో సందడి చేశారు. అనంతరం గడ్డెన్న జలాశయంలో నిమజ్జనం చేశారు.

కుభీరు: కుభీరులోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మ వేడుకను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తిరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను సమీప వాగులో నిమజ్జనం చేశారు.

గ్రామదేవతలకు అభిషేకం

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల భక్తులు ఆదివారం గంగనీళ్లతో స్వగ్రామాలకు చేరుకున్నారు. మహిళలు మంగళహారతులతో ముందు నడవగా నీళ్ల కడవలపై వలను ఉంచారు.

లోకేశ్వరం: మండలంలోని పిప్రి, రాజురా, ధర్మోరలో ఆదివారం గంగనీళ్ల జాతరను నిర్వహించారు. భాజాభజంత్రీలు, మంగళహారతులు పట్టుకుని కడవలు తీసుకుని గంగకు వెళ్లి నీళ్లు తీసుకుని వచ్చి గ్రామంలోని గ్రామదేవతలకు అభిషేకం చేశారు.



కడ్తాల్ గ్రామంలో..

సోన్: గిన్నూర్ మహా పోచమ్మ తల్లి ఆభరణాలను, దేవుళ్ల ప్రతిమలను భక్తులు కడ్తాల్ గ్రామానికి పాదయాత్రగా ఆదివారం తీసుకు వచ్చారు. ఇక్కడి నుంచి సోన్ గోదావరికి తీసుకు వెళ్లి ఆ నీళ్లతో ఆభరణాలకు పూజలు నిర్వహించారు. గోదావరి జలాలను తీసుకొని కడ్తాల్ గ్రామానికి వచ్చారు. గ్రామస్థులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గిన్నూరుకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.

సారంగాపూర్: ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం అడెల్లి మహాపోచమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఈవో రమేష్ అమ్మవారి తీర్థప్రసాదాలతో సత్కరించారు. అంతకుముందు సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భాజపా రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మ రాజు, మండలాధ్యక్షుడు కరిపె విలాస్ తదితరులు ఉన్నారు. ఆలయ పరిసరాల్లో దావోజీనాయక్ నూతనంగా నిర్మించిన దుకాణ సముదాయాన్ని ప్రారంభించారు. జాతర మొదలుకొని ముగింపు వరకు ఎస్పీ జానకి షర్మిల స్వయంగా పర్యవేక్షించారు. డీఎస్పీ, సీఐ, ఎనిమిది మంది ఎస్సైలు, పోలీసు సిబ్బంది, ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ బాధ్యత డీఎస్పీ గంగారెడ్డికి అప్పజెప్పారు. నిర్మల్ గ్రామీణ సీఐ రామకృష్ణ, సారంగాపూర్ ఎస్సై ఎస్.శ్రీకాంత్‌లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు.



పిప్రిలో గంగనీళ్లతో ఊరేగింపుగా వస్తున్న గ్రామస్థులు